ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబరు, 2024
5
శ్రీకాకుళం



29న సుందరయ్య విగ్రహావిష్కరణ



శ్రీకాకుళం అర్బన్ : ప్రజలే ప్రాణంగా.. ఉద్యమమే ఊపిరిగా.. ఆశయాలే గీటురాయిగా.. ఆదర్శానికి ప్రతిరూపంగా.. కడదాకా నడయాడిన కమ్యూనిస్టు గాంధీగా కీర్తిగాంచిన వైతాళికులు.. దక్షిణ భారత కమ్యూనిస్టు నాయకుడు.. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 29న నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న స్మృతి వనంలో నిర్వహిస్తున్నట్టు గాంధీ మందిరం నిర్వాహకులు సురంగి మోహనరావు, ఎం.వి.ఎస్.శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్య్ర సమరయోధులు సంపూర్ణస్వరులు కొలువై ఉన్న స్మృతి వనంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు పాల్గొంటున్నట్టు తెలిపారు.

కరెంట్ ఛార్జీలు... తగ్గిస్తామని పెంచుతున్నారు

- విద్యుత్ భారాలు మోపుతున్న కూటమి ప్రభుత్వం
- వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్




ర్యాలీగా వెళ్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - సోంపేట

గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పలురూపాల్లో మోపిన విద్యుత్, ఇతర భారాలను తగ్గిస్తామని, కరెంటు ఛార్జీలు పెంచబోమని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ అధికారంలోకి వచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ఆ హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీల 2022-23 సంవత్సరానికి సుమారు రూ.6,072 కోట్ల భారం మోపుతూ విద్యుత్ నియంత్రణ మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. సోంపేట మండల కేంద్రంలోని ఒక కళ్యాణ మండపంలో ఆ పార్టీ మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి వద్ద నుంచి గాంధీ మండపం కూడలి మీదుగా కవిటి రోడ్డులోని తెలగ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు దుంపల కృష్ణారావు ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు అమరవీరులకు సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. అనంతరం నిర్వహించిన సభలో తులసీదాస్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి మరో రూ.11 వేల కోట్లకు పైగా సర్దుబాటు విద్యుత్ ఛార్జీల భారం మోపబోతోందని వార్తలు వస్తున్నాయన్నారు. సుమారు రూ.20 వేల కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై పడబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యుత్ కంపెనీల దోపిడీ, అధిక రేట్లకు పవర్ ఎక్స్ఛేంజ్లో స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు, పలు స్థాయిల్లో అవినీతి, అపసవ్య విధానాలతో విద్యుత్ వ్యయం పెరుగుతోందని తెలిపారు. ఆ భారాన్ని సర్దుబాటు ఛార్జీల రూపంలో జనం నెత్తిన వేయడం అసమంజసమన్నారు. నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్ని తాకుతున్న దశలో ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, అదనపు భారాలు మోపడం సరికాదన్నారు. ఏనాడో వాడుకున్న విద్యుత్కు తర్వాత కాలంలో సర్దుబాటు ఛార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మోహనరావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేస్తున్న సోంపేటలోని గోల్డ్ ల్యాండ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం సిపిఎం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సంగారు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులుగా జుత్తు సింహాచలం, దున్న యామయ్య, షణ్ముఖరావు, ధర్మారావు, చిరంజీవిని ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఎం నాయకులు టి.పాపారావు, డి.హేమయ్య, పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

31న సిఎం చంద్రబాబు రాక



ప్రజాశక్తి - సోంపేట

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 31వ తేదీన జిల్లా పర్యటనకు రానున్నారు. పర్యటనా ఏర్పాట్లకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోజున ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేటలో ప్రారంభించనున్నారు. సిఎం పర్యటన సభాస్థలిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఇన్ఛార్జి ఆర్డిఒ కృష్ణమూర్తి, కాశీబుగ్గ డిఎస్పి శ్రీనివాసరావు, సోంపేట సిఐ మంగరాజు, ఎస్ఐ చంద్రశేఖర్ మండలంలోని కొర్లాం, పాలవలసలో ఆదివారం పర్యటించారు. సోంపేటలో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించి సభాస్థలిని ఖరారు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పర్యటన ఖరారైతే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రిగా తొలిసారి చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కవిటి మండలం రాజపురంలో సెప్టెంబరు 20వ తేదీన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో సిఎం పాల్గొనాల్సి ఉండగా, వాతావరణ అనుకూల పరిస్థితులతో పర్యటన రద్దయిన విషయం విదితమే.

నవంబరు నుంచి నైపుణ్య గణన

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నవంబరు మొదటి వారం నుంచి జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్)కు శ్రీకారం చుడుతున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నైపుణ్య గణన దేశంలోనే తొలిసారి మన రాష్ట్రంలో చేయబోతున్న ఒక గొప్ప ప్రయత్నమన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 29వ తేదీన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం మాస్టర్ ట్రైనర్ల ఎంపిక ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయి శిక్షణ అనంతరం వారంతా మండల, మున్సిపాలిటీ స్థాయిలో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యాన మండలస్థాయిలోని సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారని, సంబంధిత వివరాలు నైపుణ్యం అనే అప్లికేషన్ (యాప్) ద్వారా సేకరిస్తారని చెప్పారు. పరిశ్రమల అవసరాలు, మానవ వనరుల వివరాలు బేరీజు వేసుకొని తగిన ప్రణాళికలు రూపొందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని 15 నుంచి 59 వయసు మధ్య ఉన్న నైపుణ్యం గల వ్యక్తుల వివరాలు సేకరించి తద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ గణన పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా ఉపాధి అధికారిని నోడల్ అధికారులుగా నియమించామని, సచివాలయ సిబ్బందిని ఇందులో భాగస్వాములుగా చేస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి బిఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం, పార్వతీపురం (మన్యం) జిల్లాల పరిధిలో ఈనెల 28 నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు బిఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ నాయుడు మర్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో సంస్థకు సంబంధించిన అవినీతిపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫిర్యాదులను నేరుగా గానీ ఫోన్ ద్వారా గానీ ఇవ్వాలని సూచించారు. ఫోన్ ద్వారా సమాచారం అందించాల్సిన వారు 08942 226700, 9441668789 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.



కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద మోహరించిన పోలీసులు


మాజీ మంత్రి అప్పలరాజును గృహ నిర్బంధం చేస్తున్న పోలీసులు

పలాసలో ఉద్రిక్తత

- కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ముట్టడి భగ్నం
- మాజీ మంత్రి అప్పలరాజు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - పలాస

సోంపేట మండలం కొర్లాంకు చెందిన బాలికపై టిడిపి నాయకుడు దాడి ఘటనపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పోలీస్‌స్టేషన్ ముట్టడికి ఆదివారం పిలుపునివ్వడం ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి స్టేషన్‌కు రాకుండా కాశీబుగ్గ డిఎస్‌పి శ్రీనివాసరావు నేతృత్వాన సిఐ డి.మోహనరావుతో పాటు డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు ఆయన ఇంటి వద్దకు చేరుకుని గృహ నిర్బంధం చేశారు. మరోవైపు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు అప్పలరాజు ఇంటి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల వ్యవహార శైలిని వైసిపి నాయకులు తప్పుపట్టారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్, గౌతు శిరీష డౌన్ డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాలిక, తల్లిపై దాడి చేసిన టిడిపి నాయకుడు ఢిల్లీరావును పోక్సో చట్టం కింద అరెస్టు చేయాలని, పోలీస్‌స్టేషన్‌లో వైసిపి నాయకులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని అప్పలరాజు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కేసులు నమోదు చేస్తామని డిఎస్‌పి హామీనివ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

టిడిపి, వైసిపి నాయకుల ఘర్షణ

మండలంలోని వీరభద్రాపురానికి చెందిన టిడిపి నాయకుడు కొర్ల విష్ణు చౌదరి, వైసిపి నాయకుడు అల్లు వెంకటరమణ పరస్పరం దాడి చేసుకున్నారు. విష్ణు చౌదరి కెటి రోడ్డుపై శనివారం రాత్రి వెళ్తుండగా కాశీబుగ్గలో అప్పయ్యదొర విగ్రహం వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అనుచరుడు అల్లు వెంకటరమణతో పాటు వైసిపి నాయకులు ఉన్నారు. ఆ సమయంలో విష్ణు చౌదరి, వెంకటరమణ మధ్య మాటకు మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో విష్ణు చౌదరికు గాయాలు కాగా, తనపై కత్తితో దాడి చేశాడని వెంకటరమణ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో విష్ణు చౌదరితో పాటు టిడిపి నాయకులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. గాయాలపాలైన విష్ణు చౌదరిని వైద్య పరీక్షల కోసం పంపించకుండా వెంకటరమణను స్టేషన్‌లో కూర్చోపెట్టి మర్యాదలు చేస్తారా అంటూ టిడిపి నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వెంకటరమణతో పాటు మాజీ మంత్రి మరో అనుచరుడు మొదలవలస మన్మథరావుపై పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నాయకులు దాడి చేశారు.

అరసవల్లి ఆదాయం


రూ.3.24 లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి పలురూపాల్లో ఆదివారం రూ.3.24 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి భద్రాజీ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,18,700, విరాళాల రూపంలో రూ.50,849, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,54,575 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఆదిత్యుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి తర్లాడ రాజశేఖర్ కుటుంబసభ్యులతో కలిసి సమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో ఆయనకు ఆలయ ఇఒ వై.భద్రాజీ శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు.


చిత్రపటాన్ని స్వీకరిస్తున్న హైకోర్టు జడ్జి రాజశేఖర్

'104' ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అరబిందో యాజమాన్యం నిర్వహిస్తున్న 104 వాహనాల్లో సేవలు అందిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, గడచిన కాలంలో మూడు నెలలకొకసారి జీతాలు చెల్లిస్తూ అలవెన్స్‌లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని సిఐటియు నాయకులు ఆర్.సురేష్‌బాబు అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన 104 ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరబిందో యాజమాన్యం గడచిన రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. ఎంఒయు షరతులకు లోబడి వాహనాలను నడపకుండా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉద్యోగులపై ప్రభావం పడుతోందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా నారాయణ మాట్లాడుతూ 104 సర్వీస్‌లను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి అరబిందో యాజమాన్యానికి పెద్దఎత్తున చెల్లింపులు జరుగుతున్నా ఉద్యోగులకు మాత్రం సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మాన కిరణ్ మాట్లడుతూ ఈ సంస్థ యాజమాన్య బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ నాలుగేళ్లలో క్రమపద్ధతిలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీనివల్ల ఉద్యోగులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు మూడేళ్లుగా ఇంక్రిమెంట్ లేవన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని 104 సర్వీస్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. 104లో పనిచేస్తున్న డ్రైవర్లుకు జిఒ నంబరు 7 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. పిఎఫ్, ఇతర సౌకర్యాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో యూనియన్ జాయింట్ సెక్రటరీ రాము, కోశాధికారి నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌బాబు

ఎస్‌సి వర్గీకరణను పున:పరిశీలించాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రాల్లో ఎస్‌సిలను ఎ,బి,సి,డిలుగా వర్గీకరణ చేసుకోవచ్చునని కోర్టు తీర్పును పున:పరిశీలించాలని, ఈ తీర్పుపై దళిత ఎంపీలు గానీ, ఎమ్మెల్యేలు గానీ ఖండించకపోవడం హాస్యాస్పదంగా ఉందని రాజమండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు హర్షకుమార్, ఐడిఎఎస్ విశ్రాంత ఉద్యోగి పి.ఎస్.ఎస్.మూర్తి, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్సు అన్నారు. కాశీబుగ్గ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ, క్రిమిలేయర్కు వ్యతిరేకగా రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా మన హక్కుల సాధనకు అవగాహనా సదస్సు ఆదివారం నిర్వహించారు. ముందుగా కాశీబుగ్గలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అక్కడి నుంచి రైల్వే ఇనిస్టిట్యూట్ వరకు రాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులో ఇచ్చిన తీర్పును పున్ణపరిశీలించాలని కోరారు. వేసిన 32 రివ్యూ పిటీషన్లను సుప్రీం కోర్టు కొట్టివేయడం, అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ ఫలాలను తీసివేసి ఆర్‌ఎస్ఎస్ మనువాదకుల రాజకీయ పార్టీలు దళితుల పతనాన్ని కోరుకుంటన్నాయని అన్నారు. అందుకే దళితులు యువకులు మేల్కొని చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పిల్ల కృష్ణారావు, మట్ట జీవన్, పి.ప్రకాష్, శంకర్, అనురాధ, సత్యనారాయణ, దేవరాజు, దుర్యోధనరావు, అప్పారావు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న హర్షకుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

పోలీసుల ప్రేక్షకపాత్ర

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గలో పోలీస్ స్టేషన్‌లో వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకులు దాడి చేస్తుంటే... పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత బాలికలపై అత్యాచారాలు, వైసిపి నాయకులపై టిడిపి నాయకులు దాడి చేస్తే వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బాలికలపై అత్యాచారం జరిగితే ఎమ్మెల్యే తన కార్యాలయంలో నిందితుడిని కూర్చోబెట్టి సెటిల్‌మెంట్లు చేయడం, అత్యాచార బాధిత తల్లికి ఫోన్‌లో మాట్లాడడం వంటి అంశాలు సిసి ఫుటేజ్‌లో ఉన్నాయని అన్నారు. దానికి పరిశీలించడానికి తేదీ నిర్ణయిస్తే రావడానికి తాను సిద్ధంగా ఉన్నామన్నారు. ఇటీవల మరో బాలిక ఆమె తల్లిపై టిడిపి నాయకుడు అర్ధరాత్రి సమయంలో దాడి చేయడం దీనిపై బాధితురాలు స్వయంగా వీడియోలో మాట్లాడిన సంఘటనలు అందరూ చూశారని అన్నారు. అయినా ఇప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తామేదో నేరాలకు ఘోరాలకు పాల్పడినట్టు ఆదివారం తెల్లవారిజామున వంద మంది పోలీస్ బలగాలు తన ఇంటికి ముట్టడించడంతో తమ కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు.

బాలికపై దాడి జరిగితే సాధారణ కేసుగా పోలీసులు నమోదు చేశారని, దీనిపై తాము ఫిర్యాదు చేసేందుకు ఆదివారం పోలీస్ స్టేషన్‌కు బయలుదేరడానికి సిద్ధంగా ఉంటే పోలీస్ బలగాలు గృహ నిర్బంధం చేసి ముట్టడించడం దారుణమని అన్నారు. త్వరలో పోలీస్‌స్టేషన్‌కు పసుపు రంగు వేసి స్టేషన్ టిడిపి నాయకులకే పరిమితం అనే బోర్డు రాసి వస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రయివేటు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

'ఉపాధి' నిధులతో మౌలిక సదుపాయాలు

- కన్వర్జెన్సీ పనులపై ప్రత్యేక శ్రద్ధ
- గ్రామస్థాయిలో బడ్జెట్‌కు రూపకల్పన
- తాగునీటి ఎద్దడికి ముందస్తు ప్రణాళిక
- జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజు

ప్రజాశక్తి శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత నిస్తున్నామని జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పల్లె పండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు పెద్దఎత్తున శంకుస్థాపనలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం, ఇంటి పన్ను వసూళ్ళు, చెత్త నుంచి ఆదాయం సమకూర్చుకునే విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనతో ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.


? పల్లె పండగ ద్వారా మంజూరు చేసిన పనులు ఎలా సాగుతున్నాయి?

ఉప ముఖ్యమంత్రి, పంచాయతరాజ్‌శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలను అనుసరించి ప్రతి గ్రామంలో పల్లె పండగ వారం రోజుల పాటు నిర్వహించాం. ఈ కార్యక్రమంలో గ్రామాల వారీగా సమస్యలను గుర్తించడం, వాటి కోసం అనుమతులు తీసుకుని త్వరితగతిన చేపట్టిపూర్తి చేస్తున్నాం. ప్రభుత్వ ప్రాధాన్యత ఆధారంగా పనులు చేపడుతున్నాం. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

? ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఎలా ఉంది?

జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధులు 2021-22లో మొదటి విడతగా జెడ్‌పి పద్దుకు టైడ్ గ్రాంట్ కింద రూ.5.58 కోట్లు, అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.3.70 కోట్లు, రెండో విడత టైడ్ గ్రాంట్ కింద రూ.5.54 కోట్లు, అన్ టైడ్ గ్రాంట్ కింద రూ.3.70 కోట్లు సర్దుబాటైంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా టైడ్‌గ్రాంట్ కింద రూ.5.78 కోట్లు అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.3.90 కోట్లు సర్దుబాటైంది. మండలాల పద్దులకు గాను 2021-22 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా ఉమ్మడి జిల్లాలోని 38 మండలాలకు టైడ్ గ్రాంట్ కింద రూ.5.58 కోట్లు, అన్ టైడ్ గ్రాంట్ కింద రూ.3.70 కోట్లు, రెండో విడత టైడ్ గ్రాంట్ కింద రూ.5.55 కోట్లు, అన్‌టైడ్ గ్రాంట్ రూ.3.70 కోట్లు విడుదలైంది. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.9.60 కోట్లు సర్దుబాటైంది. ఈ నిధులతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 2021-22 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని 38 సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌ల నిర్వహణకు రూ. 24.84 కోట్లు, 2022-23 సంవత్సరానికి ఈ స్కీమ్‌లకు రూ.27.52 కోట్లు మంజూరు చేశాం. రూ.15.85 కోట్ల అంచనాలతో తాగునీటి అవసరాలకు 471 పనులు మంజూరు చేశాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.11.61 కోట్ల అంచనాలతో గ్రామాల్లో 363 శానిటేషన్ పనులు చేపట్టాం.





? సాధారణ నిధుల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో సాధారణ నిధుల నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.4.84 కోట్ల అంచనాలతో 126 పనులు మంజూరు చేశాం. వాటిలో ఇప్పటి వరకు రూ. 3.21 కోట్ల అంచనాతో 71 పనులు పూర్తి చేశాం. జిల్లా పరిషత్ కార్యాలయం, ప్రాంగణంలో 20 సోలార్ లైట్లు ఏర్పాటు చేశాం. సమావేశ మందిరానికి సోలార్ సిస్టంలో విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ అనుమతి కోరాం. వీటితో పాటు మండల పరిషత్ కార్యాలయాలు 12 చోట్ల శిథివవస్థకు చేరాయి. వాటిని స్థానంలో కొత్త భవనాలు చేపట్టేందుకు అనుమతి కోరాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

? గ్రామ సచివాలయాల్లో సేవల ఎంతమేరకు అందుతున్నాయి?

జిల్లాలో గ్రామ సచివాలయాలు ఏర్పాటైన తర్వాత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరయ్యాయి. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుని ఇంటికే అందిస్తున్నాం. ప్రజలకు ఏ చిన్న సమస్య ఎదురైనా సచివాలయం స్థాయిలో పరిష్కరించుకునేందుకు వీలుంది. అక్కడ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తే తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సేవలను విస్తృతం చేయడానికి సొంత భవనాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో శాశ్వతమైన కట్టడాలు నిర్మిస్తున్నాం.

? 'సాంఘిక భద్రత'కు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా పరిషత్, యాజమాన్యం పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి మృతి చెందిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి సాంఘిక భద్రతా పథకం అమలు చేస్తున్నాం. కోవిడ్ తర్వాత 59 మందికి వివిధ కేడర్లలో ఉద్యోగ నియామకాలు చేట్టాం. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాం.


రేవతి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

మెరుగైన వైద్యం అందించాలి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో జొన్నలవలస గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి హోంగార్డు రేవతి శివారం గాయపడింది. స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం పట్టణంలో మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి మెడికవర్ ఆస్పత్రిని సందర్శించి గాయపడిన హోంగార్డు రేవతిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రేవతికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఎస్‌పితో పాటు డిఎస్‌పి సిహెచ్ వివేకానంద, సిఐలు ఇమ్మాన్యుల్ రాజు, ఉమామహేశ్వరరావు ఉన్నారు.


పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

పాత జిల్లా ఆస్పత్రి భవనాల పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పాత జిల్లా ఆస్పత్రి భవనాలను ఆర్‌డిఒ ఎన్.కృష్ణమూర్తి అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. టెక్కలి జిల్లా ఆస్పత్రికి నూతన భవనాల నిర్మాణం చేపట్టిన అనంతరం పాత భవనాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో టెక్కలిలో అద్దె భవనాల్లో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలకు పాత జిల్లా ఆస్పత్రి భవనాలు కేటాయించేందుకు పరిశీలించారు. కొంతకాలంగా నిరుపయోగం ఉన్న భవనాలు ప్రభుత్వం కార్యాలయాలకు వినియోగించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించడంతో పరిశీలించారు. ఈయనతో పాటు పంచాయతీ, హౌసింగ్, మండల పరిషత్ అధికారులు ఉన్నారు.


పోస్టర్లను అందజేస్తున్న భాస్కరరావు

రేపు విశాఖలో మహాధర్నా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విశాఖ డెయిరీ పాల సేకరణ ధర తగ్గింపునకు నిరసనగా ఈ నెల 29 న విశాఖపట్నంలో మహాధర్నా నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తమ్మినేని భాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని శారదాపురం, డోకులపాడు గ్రామాల్లో ఆదివారం పర్యటించి రైతులకు పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు ధరను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం డెయిరీలు పాల రైతులకు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాల రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల పోషణ నిర్వహణ వ్యయం పెరిగినా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా కొనసాగుతున్న పాడి పరిశ్రమను కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కళింగ కోమటి సంఘ నాయకులు

కళింగ కోమట్ల ఒబిసి సాధనే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ర వ్యాప్తంగా ఉన్న కళింగ కోమట్లను జాతీయ స్థాయిలో ఒబిసి జాబితాలో చేర్చేందుకు సంఘం నేతృత్వాన పూర్తిస్థాయి కృషి చేస్తానని కళింగ కోమటి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు అన్నారు. ఆదివారం నగరంలోని రైస్‌మిల్లర్స్ హాల్లో కళింగ కోమటి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగ కోమట్లలో అనేక కుటుంబాలు నేటికి చిల్లర వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, కొందరు ఇప్పటికీ పేదరికంలో ఉన్నారన్నారు. అటువంటి వారిని ఆదుకునేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో గతంలో బిసి సాధనలో అన్ని వర్గాల వారు పూర్తి సహకారం అందించడంతో సాధించు కోగలిగామన్నారు. అదే స్ఫూర్తితో ఒబిసి సాధనకు కృషి చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించి పిల్లలు మంచి భవిష్యత్‌ను అందుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు నారాయణ శెట్టి శ్రీనివాసరావు, పూర్వపు అధ్యక్షులు కోణార్క్ శ్రీను, కళింగ కోమటి కార్పోరేషన్ మాజీ చైర్మన్ అందవరపు సూరిబాబు, ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వపు సిండికేట్ మెంబరు జామి భీమ శంకర్, పట్టణ వర్తక సంఘం అధ్యక్షులు కోరాడ హరి గోపాల్, పి.వి.రమణ, తంగుడు జోగారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

శ్రీవిద్యాపీఠంలో అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని గాజులవీధిలో ఉన్న శ్రీవిద్యాపీఠం ఆధ్వర్యాన ఆదివారం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. దసరా వేడుకల అనంతరం ఏటాసాగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఈ వితరణ చేపట్టారు పీఠం అధిపతి పమ్మిన వెంకటరావు నేతృత్వాన జరిగిన కార్యక్రమంలో శ్రీవిద్య ఉపాసకులు ఆచంట రాము, సాలిహుండం రవికుమార్, భవానీ ప్రసాద్, సుష్మ, శ్రీదేవి, నటుకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


అన్నవితరణ చేస్తున్న వెంకటరావు


మామిడివలసలో రోడ్డు పక్కనే చెత్తా చెదారం

అయినోళ్లకే అందలం

- పది పంచాయతీలకే నిధులు మంజూరు
- గ్రామాల అభివృద్ధిలో రాజకీయమా..?
- సర్వత్రా విమర్శలు

తమ పాలనలో ఎక్కడా విమర్శలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని, అలాగే పంచాయతీలకైనా, పార్టీలకైనా ఎటువంటి వివక్షత చూపబోమని సాక్షాత్తు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి- బూర్జ

పల్లెలు అభివృద్ధి చెందితేనే తద్వారా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందాలని నిర్ణయించారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం ద్వారా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడమే కాకుండా ఆ పంచాయతీలకు అవసరమైన పనులు గుర్తించాలని సూచించారు.

మండలంలో 30 పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించి అధికారులు అవసరమైన పనులు గుర్తించారు. అయితే నిధులు మాత్రం కొన్ని పంచాయతీలకే కేటాయించడంతో అన్నివర్గాల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. 30 పంచాయతీల్లో పనులు గుర్తించిన అధికారులు కేవలం కొన్ని పంచాయతీలకే నిధులు మంజూరు చేయడంలో వున్న ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

20 పంచాయతీలకు మొండిచేయి

మండలంలోని లాభం, అన్నంపేట, పెద్దపేట, సింగన్నపాలెం, గుత్తావల్లి, తుడ్డలి, పిఎల్ దేవిపేట, ఓటికూర్ పేట, ఉప్పినవలస, ఎపిపేట పంచాయతీలకు మాత్రమే నిధులు మంజూరు చేసి మిగిలిన 20 పంచాయతీలకు మొండి చేయి చూపించడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకే కొన్ని పంచాయతీలకు నిధులు మంజూరు కాకుండా అడ్డుకట్ట వేశారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. టిడిపి ప్రాతినిధ్యం వహిస్తున్న సర్పంచ్‌ల పంచాయతీలకు మాత్రమే నిధులు మంజూరు చేయడం సరైంది కాదని, కేవలం వైసిపి సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకు నిధులు మంజూరు చేయ కుండా కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఈ విధంగా చేశారని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో గ్రామాల అభివృద్ధి చెందాలని, పక్కా రహదారులు, కాలువలు ఏర్పాటు చేయాలని సంకల్పించి నప్పటికీ కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఇటువంటి పనులకు పూను కుంటు న్నారని స్థానికులు అభి. ప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలంలోని అన్ని పంచాయతీలకు నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


బావి చుట్టూ ఉన్న అపారిశుధ్యం


మాట్లాడుతున్న ప్రసాద్

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రజా పోరాటాలు సారధి, ఐక్య పోరాటాలు వారధి సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, ఎం.అప్పారావు పిలుపునిచ్చారు. హిరమండలంలోని ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నవంబరు 9,10 తేదీల్లో పలాసలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకవిధానాలకు వ్యతిరేకంగా నిరంతరం రాజీలేని పోరాటాలు సిపిఎం చేస్తుందన్నారు. ఆ రోజు ప్రదర్శన, బహిరంగ సభలు ఉంటాయన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉపాధి పనులను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దళిత, గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

పోలాకి: మండలంలో ఈదులవలసకు చెందిన కొండక వెంకటేష్, జలుమూరు మండలం అల్లాడకు చెందిన మొజ్జాడ కృష్ణవేణి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వెంకటేష్‌కు రూ.64,470, కృష్ణవేణికి రూ.50 వేలు నిధులు విడుదలయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఇరువరికీ అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలపై దాడులు తగవు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కత్తి దాడి జరిగిందని రక్తంతో తడిసిన వైసిపి కార్యకర్త ఫిర్యాదు చేసేందుకు పలాస పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పోలీసుల సమక్షంలో పోలీస్ స్టేషన్‌లోనే మరోమారు దాడిచేసి రక్షణ లేకుండా చేశారని, ఇటువంటి దాడులతో వైసిపి కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయాలన్నదే వారి లక్ష్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇటువంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, టిడిపి గుండాలు చేసిన దాడితో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. దాడికి పాల్పడ్డ నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల నిర్వహణపై సామాన్యుడికి పోలీసులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వైసిపి కార్యకర్తలు సహనం కోల్పోయే రీతిలో నిర్లక్ష్యం చేస్తే తర్వాత పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. గాయపడ్డ బాధిత కుటుంబాలకు తాము అండగా నిలుస్తామన్నారు. న్యాయం జరగకపోతే, పలాసలో మహాధర్నా చేపడతామని హెచ్చరించారు

ఎన్నాళ్లీ నిరీక్షణ?

కవిటి: తరగతి ధ్రువీకరణ పత్రాలకు 306 రోజులుగా దీక్ష చేస్తున్న తాము ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని బెంతు ఒరియలు ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారానికి నియోజకవర్గంలోని బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 306వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో నాథపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ యువత ఉద్యోగాలు కోల్పోతోందని, పిల్లలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్ దొళాయి, దొయానిది దొళాయి, లోకు బిసాయి, దుదిష్టి మజ్జి తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దాం



మాట్లాడుతున్న దాలయ్య

ప్రజాశక్తి- నందిగాం

త్వరలో జరగనున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దామని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య అన్నారు. నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు జె.చంద్రశేఖరరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పనులు తగ్గించి బోధనకు అవకాశం ఇవ్వాలని సూచించారు. సంస్కరణలు విద్యాభివృద్ధిని పెంచేవిగా ఉండాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు మాట్లాడుతూ 117 జిఒను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను తద్వారా ఉన్నత పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.ధర్మారావు, అధ్యక్షులుగా కె.కుమారస్వామి, సహాధ్యక్షులుగా పి.వేణు, ఎం.బాలామణి, ట్రెజరర్‌గా కె.బాపూజీ, 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథులు, విశ్రాంతి ఉపాధ్యాయులు వజ్జ సింహాచలం, గార రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలవలస ధర్మా రావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, టెక్కలి జనరల్ సెక్రటరీ టి.వైకుంఠరావు పాల్గొన్నారు.

117 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పోలాకి

జిఒ నంబరు 117తో ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా నాశనమయ్యాయని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. పోలాకిలో మండల అధ్యక్షులు ఎస్.రాజేష్ అధ్యక్షతన ఆదివారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ జిఒతో ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేశారని అన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు మాట్లాడుతూ ఆర్థిక సంబంధమైన పిఎఫ్‌లు, సరండర్ లీవు, ఎపిజిఎల్‌ఐసిలు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి పి.ఉమాభాస్కర్ గత సంవత్సర కార్యకలాపాల పోరాటాల నివేదికను తెలియజేశారు.



మాట్లాడుతున్న ఉమాభాస్కర్

అనంతరం మండలం నూతన కమిటీని ఎన్నికల అధికారి బమ్మిడి శ్రీరామ్మూర్తి, పరిశీలకులు కోరాడ వైకుంఠరావు ఆధ్వర్యాన నిర్వహించారు. నూతన కమిటీలో గౌరవాధ్యక్షులుగా కె.వెంకటరమణ, అధ్యక్షులుగా ఎస్.రాజేశ్వర రావు, సహాధ్యక్షులు ఎస్.శివదేవి, ఎం.సునీల్, గౌతమ్, ప్రధాన కార్యదర్శిగా పి.ఉమాభాస్కర్, కోశాధికారిగా ఎం.శ్యామలరావు ఎన్నికయ్యారు.

విద్యుత్ ఛార్జీల భారం అన్యాయం


విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు సర్దుబాటు చార్జీల పేరుతో రూ.ఆరు వేల కోట్లు విద్యుత్ చార్జీల భారం మోపడం అన్యాయమని, ఇదే చంద్రబాబు మార్క్ పాలనకు నిదర్శనమని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తనకు అధికారం ఇస్తే విద్యుత్ ఛార్జీలు పెంచనని ఉపన్యాసాలిచ్చి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే మాట మార్చి విద్యుత్ ఛార్జీలు పెంచుకోవటానికి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ ద్వారా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అనుమతులు ఇచ్చారని ఇది దుర్మార్గమన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా జగన్ మోహన్ రెడ్డి మీద బురదజల్లుతూ కాలం గడుపుతున్నారని, ఛార్జీలు పెంపు విషయం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు వైఎస్ షర్మిల విషయాన్ని ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి విద్యుత్ చార్జీలు భారీగా పెంచటం పరిపాటిగా మారిందని, గతంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ర్యాలీ చేసిన రైతులపై కాల్పులు జరిపించిన బషీర్ బాగ్ ఘటన ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. ప్రశ్నిస్తానని రాజకీయల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ తన పదవిని కాపాడు కోవటం కోసం రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను నిలదీయకుండా చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నారని ఎద్దేవా చేశారు. జనసేన కార్యకర్తలకు జరుగుతున్న అవమానాలను కూడా పవన్ కళ్యాణ్ పట్టించుకోవడం లేదన్నారు. ఆయనతో పాటు వైసిపి ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం

ప్రజాశక్తి- కవిటి

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న మండలంలోని బట్టివానిపాలెంకు చెందిన మదన్ వైద్యం కోసం దాతలు ఉదారంగ స్పందించారు. మత్స్యకార గ్రామాల ప్రజలు, బంధువులు, స్నేహితులు, బాణమ్మ రాములయ్య ట్రస్టు కలిసి మదన్ వైద్యం కోసం నగదు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.1,69,600లు విశ్రాంతి డిఎస్‌పి, జనసేన నాయకుడు ఎస్.వి.వి.ప్రసాదరావు చేతుల మీదుగా ఆదివారం మదన్‌కు అందించారు. అనంతరం మాట్లాడుతూ మదన్ వైద్యం కోసం ఇచ్చిన ఒక్క పిలుపుతో మత్స్యకార గ్రామాల ప్రజలు, స్నేహితులు, బంధువులు అందించిన సహకారం మరువలేదన్నారు. కార్యక్రమంలో నేతాజీ, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని బడేకుప్పన్నపేటలో ఉన్న కెపి స్పందన ఫౌండేషన్ జబ్బు బారిన పడి, ప్రమాదానికి గురై, కష్టాల్లో ఉన్న వారిని, పూట గడవటం కష్టమైన బోరుభద్రకు చెందిన సింతిరి శ్రీరాములు కుటుంబానికి, టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీ 7వ లైన్‌కి చెందిన సవర ఆనందరావు కుటుంబానికి ఒక నెలకు సరిపడా 25 కిలోల బియ్యం, 35 రకాల నిత్యావసర వస్తువులు, రూ.2 వేలు నగదు ఆదివారం అందజేశారు. ఈ మొత్తాన్ని బడే


కవిటి : నగదు అందజేస్తున్న ప్రసాదరావు

శ్రీనివాసరెడ్డి సమకూర్చారు. కార్యక్రమంలో కెపి స్పందన అధ్యక్షులు షణ్ముఖరావు, సర్పంచ్ భూషణరెడ్డి, శివారెడ్డి, సూర్యప్రకాష్, సింహాచలం పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని బెంకిలికు చెందిన సంగారు శ్యామ్ అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.42 వేలు వసూలు చేసి శ్యామ్‌కు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాద్, జుత్తు పురుషోత్తం, పిరియా ధర్మేంద్ర, గుజ్జుల శంకర్రావు, షావుకారి ప్రేమ్‌కుమార్, బార్ల ప్రదీప్, భైరి కుమార్‌స్వామి పాల్గొన్నారు.

బంగారు బిస్కెట్ల వ్యవహారంలో కీలక మలుపు

- నగదు, వస్తువుల్లో మరికొందరి హస్తం
- ఆందోళనలో బాధితులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడలో బంగారు బిస్కెట్ల వ్యవహారం ఇటీవల సంచలనం రేపిన విషయం తెలిసిందే. కిలో బంగారు బిస్కెట్లు రూ.10 లక్షలకే ఇస్తానని చెప్పి గ్రామానికి చెందిన దుక్క దేవి బాధితుల నుంచి భారీగా నగదు వసూలు చేసింది. అయితే దీనిపై బాధితులు ఇటీవలే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ పెద్ద మనుషుల సమక్షంలో దేవి 15 రోజులు వ్యవధిలో అందరికీ నగదు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇక్కడే అసలు విషయం బయటపడింది. ఈ నగదు వ్యవహారంలో ఆమెతోపాటు మరికొందరి హస్తం ఉన్నట్లు ఆధారాలు బయటపడ్డాయి. అదే గ్రామానికి చెందిన పైల లక్ష్మి అనే మహిళ బాధితురాల్లో ఒకరైన భాగ్యలక్ష్మి వద్ద నుంచి రూ.30 లక్షలు తీసుకున్నట్లుగా రాసిచ్చిన ప్రామిసరీ నోటు బయటకు వచ్చింది. ఈ తతంగంలో లక్ష్మి పాత్ర కీలకంగా ఉన్నట్లు బాధితులు వీడియో సందేశం ద్వారా వెల్లడించారు. తమకు దుక్క దేవి వద్ద బంగారు బిస్కెట్లు ఉన్నట్లు, నగదు చెల్లిస్తే



భాగ్యలక్ష్మి వద్ద రూ.30 లక్షలు తీసుకున్నట్లు రాసిచ్చిన నోటు

రెండింతలు బంగారం అందజేస్తుందని తమకు లక్ష్మియే నమ్మించిందని వెల్లడించారు. ఈ విషయం దేవి కూడా బయట పెట్టడంతో లక్ష్మి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇలా ఉండగా గతంలో పెద్ద మనుషులుగా వ్యవహ రించిన పలువురు వైసిపి నాయకుడు, మరో మహిళ హస్తం ఉన్నట్లు బాధితురాలతో పాటు దేవి తరపున పెద్ద మనుషులు కూడా ఆరోపిస్తున్నారు. వారు దేవీని వాహనంలో రోజులు తరబడి తిప్పుతుండడంతో వారి పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాదు గతంలో బాధితులు ఫిర్యాదు మేరకు దేవితో పాటు ఆ ఇద్దరినీ పలాసలో పోలీసులు అదుపులోకి తీసు కున్నట్లు సమాచారం. ఇంత జరిగినా విషయం బయటకు పోకుండా ఈ గ్యాంగ్ మొత్తం జాగ్రత్త పడింది. రూ.కోట్లలో వ్యవహారం కావడంతో దీనిలో కలుగజేసు కునేందుకు పెద్ద మనుషులు సైతం వెనకడుగు వేస్తున్నారు. ఈ జరుగుతున్న తతంగం చూస్తున్న బాధితులు ఏ మేరకు తమకు న్యాయం జరుగుతుందోని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

గంజాయితో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఆమదాలవలస

గంజాయి కలిగి ఉన్న నలుగురిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. మరో ముగ్గురు పరారయ్యారని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కంద్రపేట శ్మశానవాటికలో నిషేధిత వస్తువులతో కొంతమంది వ్యక్తులు ఉన్నట్లు ఎస్ఐ కె.వెంకటేష్‌కు సమాచారం వచ్చింది. కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధికి చెందిన షేక్ హరీఫ్, ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన సాగిపల్లి చరణ్ బాలునితో కలిసి గంజాయిని పంచుకుంటుండగా పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో వీరితోపాటు మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. వారు పోలీసులకు దొరక్కుండా పరారయ్యారు. తప్పించుకున్న వారినీ త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 5.2 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పర్లాకిమిడి నుండి కొంతమంది వ్యక్తులు గంజాయిని రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారినీ పట్టుకుంటామన్నారు. గంజాయి మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సిఐ పి. సత్య నారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలరాయుళ్ల అరెస్టు

రణస్థలం రూరల్: మండలంలోని తెప్పలవలస పంచాయతీ నీలంపేట సమీపంలో ఆదివారం కోడె పందాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పందాల రాయుళ్ళు 9 మందిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 9 కోళ్లు, 14 సెల్‌ఫోన్లు, 8 ద్విచక్ర వాహనాలు, రూ.32,020 నగదుని స్వాధీ నం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మాజీ సర్పంచ్‌పై దాడి

వజ్రపుకొత్తూరు, పలాస: మండలంలోని డోకులపాడు మాజీ సర్పంచ్, టిడిపి మండల నాయకులు అంబటి రామకృష్ణపై అదే గ్రామానికి చెందిన మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, వైసిపి నాయకులు యంపల్లి పాపారావు ఆదివారం దాడి చేశారు. ఈ సంఘటనపై వజ్రపుకొత్తూరు ఎస్ఐ ఎం.నిహాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన సంఘ సమావేశం నిర్వహించారు. దీనికి మాజీ సర్పంచ్ రామకృష్ణతో పాటు యంపల్లి పాపారావు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయంలో మత్స్యకార భరోసా ఎంపికైన లబ్ధిదారులు నుంచి వసూలు చేసిన మొత్తాలు విషయంలో ఇరువురి మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను సంఘానికి జమ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని పాపారావు దాడికి పాల్పడ్డాడు. డోకులపాడు నుంచి గంగాధరపల్లి వరకు తారు రోడ్డు పనులు పనులు గత కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. రామకృష్ణ తన తోట నుంచి తిరిగివస్తూ... తారు రోడ్డు పనులను పరిశీలిస్తున్న సమయంలో పాపారావు ఆయనపై దాడికి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనంపై ఉన్న రామకృష్ణను కిందకు లాగి చేతులతో గుద్ది అన్ని విషయాల్లో జోక్యం చేసుకోవద్దని బెదిరించాడు. అనంతరం స్థానికులు రామకృష్ణను పలాస ప్రభుత్వా స్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు గోరకల వసంత స్వామి, సూరాడ మోహనరావు, కర్ని రమణ, అరసవల్లి ఉమా మహేశ్వరరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు తదితరులు ఆస్పత్రికి వెళ్లి రామకృష్ణను పరామర్శించారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి స్పందన

పొందూరు: మండలం తోలాపిలోని శ్రీసత్యసాయి మందిరంలో శ్రీకాకుళం ధరణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ దానేటి ధరణేష్ బాబు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ డా.గురుగుబెల్లి యమున, సత్యసాయి సేవా సమితి కన్వీనర్, సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నాగవంశం సంక్షేమానికి కృషి

శ్రీకాకుళం అర్బన్: నాగవంశం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందడానికి నాగవంశం సంక్షేమ సంఘం తనవంతు కృషి చేస్తుందని నూతన అధ్యక్షులు ముని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అంబేద్కర్ ఆడిటోరియంలో మల్లిక సూర్యనారాయణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నల్లి ధర్మారావు హాజరై మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారంతా సంఘానికి మరింత తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. సంఘ అధ్యక్షునిగా ముని శ్రీనివాస రావు, సెక్రటరీగా మొఖర వెంకట మల్లేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా నల్లి అప్పలనాయుడు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా బోణ రాజేశ్వరరావు, కోశాధి కారిగా కొన్ని సూర్యప్రకాష్. ఉపాధ్యక్షులుగా కనకల రామారావు, బి.వి.రవిశంకర్, సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా బుచ్చిబాబు, ప్రసాదరావు, మొఖర ధర్మారావు ఎన్నికయ్యారు. శ్యాం సుందర్, నారాయణ మూర్తి, నూకరాజు, శ్రీరాములు, రామారావు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల మార్పు

సంతబొమ్మాళి: జిల్లా మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు సూరాడ రాముడు ఆధ్వర్యాన ఎఇ ఎం.శివకుమార్ సూరాడవానిపేటలో విద్యుత్ లైన్ వైర్లను ఆదివారం మార్పు చేశారు. కార్యక్రమంలో చెంచయ్య, హేమంత్, సూరిబాబు, అప్పలస్వామి, భువనరావు, సూరాడ హేమారావు, బైపల్లి లక్ష్మయ్య, అప్పలకొండ కామేష్, వామనమూర్తి పాల్గొన్నారు.